ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు



జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)
వికారాబాద్	మర్పల్లి	10.8
రంగారెడ్డి	మంగల్‌పల్లి	10.6
మేడ్చల్	ఘట్‌కేసర్	11.8


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

పండుగ వాతావరణంలో చీరల పంపిణీ

» కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పండుగ వాతావరణంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంపై సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, మహిళా సమాఖ్య సభ్యులతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. మండల స్థాయి, గ్రామ స్థాయిలో ఒక కమిటీ ఏర్పాటు చేసి చీరల పంపిణీ సజావుగా జరిగేలా చూడాలన్నారు. చీరల పంపిణీ చేయగానే సంబంధిత మహిళా అక్విటెన్స్‌ను, ఫేషియల్ రికగ్నైజేషన్ వివరాలను పంపించాలని జిల్లా, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులకు కలెక్టర్ ఆదేశించారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, మునిసిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాట్లు

» కలెక్టర్ మను చౌదరి


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మనుచౌదరి, అధికారులు

మేడ్చల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ ఆదేశాల మేరకు మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ఇందిరమ్మ చీరల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ మను చౌదరి పేర్కొన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీపై బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పండుగ వాతావరణంలో చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. దీనికోసం నియోజకవర్గానికి ఓ ప్రత్యేకాధికారిని నియమించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో, మండల కేంద్రాల్లో విడతల వారీగా ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరల పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. సజావుగా ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియ పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూములు, ఆస్తులు తాకట్టు పెడితేనే అప్పు పుట్టే రోజులు వచ్చాయి. పేద, మధ్య తరగతి చిన్న సన్నకారు రైతులు అప్పు కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. భూమిని తాకట్టు పెట్టుకొని వడ్డీకి డబ్బులు ఇస్తామని నమ్మబలికిన ఓ ముఠా అమాయక రైతులను నిండా ముంచిన ఘటన కులకచర్ల మండలం అంతారంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ వ్యవహారంలో రెవెన్యూ, పోలీసుల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకరిద్దరిపై కేసులు పెట్టి చేతులు దులుపుకోవడంతో బాధిత రైతులు కులకచర్లలో భిక్షాటనతో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక నేతల సాయంతో ప్రజా భవన్, రెవెన్యూ, హెచ్‌ఆర్‌సీల్లో ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటికీ ఎలాంటి న్యాయం జరగలేదని వాపోతున్నారు.



తాకట్టు.. భూం ఫట్!

కుదువ పెట్టిన భూమికి సేల్‌డీడ్

మార్టిగేజి అని చెప్పి దొంగ చెక్కులు
అమాయక రైతులే టార్గెట్‌గా మోసాలు
పీఎస్‌లే కేంద్రంగా సెటిల్‌మెంట్లు!
కలకలం రేపిన కులకచర్ల ఘటన


కులకచర్లలో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత రైతులు(ఫైల్)

పరిగి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అమాయక రైతులే టార్గెట్‌గా కొందరు దగాకోరులు మోసాలకు పాల్పడుతున్నారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన కొందరు రియల్టర్లు నిఖిల్‌రెడ్డి, మనోజ్, గణేశ్, సత్యం, మురళి, రాంనాయక్ తదితరులు ఓ ముఠాగా ఏర్పడ్డారు. కులకచర్ల మండలం అంతారం మాజీ సర్పంచిని కలిశారు. భూములు, ఇతర ఆస్తులను తాకట్టు పెడితే అప్పులిస్తామని నమ్మించారు. ఈ క్రమంలో అంతారం గ్రామానికి చెందిన రైతులు లింగగారి వెంకటేశ్, కావలి పాండు, కృష్ణయ్య, లక్ష్మయ్య, రాములు, శ్రీనివాస్‌ను కలిశారు. తమ పేరిట మార్ట్‌గేజ్ చేస్తే రూ.40 లక్షలు అప్పు ఇస్తామని నమ్మించారు. వందకు నెలకు రూ.2 చొప్పున వడ్డీకి రైతులు ఒప్పుకున్నారు. ఈ ఆరుగురి రైతులకు సంబంధించి 5.32 ఎకరాలకు కులకచర్ల తహసీల్దార్ కార్యాలయంలో మార్ట్‌గేజ్ అని చెప్పి ఓ ఎస్‌ఆర్‌ఐ దగ్గర డబ్బులు తీసుకొని సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రైతులకు రూ.40 లక్షలు చెక్కుల రూపంలో ఇచ్చారు. వాటిని డ్రా చేసుకునేందుకు వారు బ్యాంకుకు వెళ్లగా అవి ఫేక్ అని తేలడంతో ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. సదరు రైతులు గ్రామ మాజీ సర్పంచిని నిలదీయడంతో తాను కూడా మోసపోయానని

మిగతా 8వ పేజీలో...

నమ్మించి మోసం చేశారు



అప్పు పేరుతో నమ్మించి మోసం చేశారు. డబ్బుల కోసం వెళ్తే 39 గుంటల భూమిని మార్ట్‌గేజ్ చేసుకుంటామని చెప్పి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. నగదు ఇవ్వకుండా చెక్కులు ఇచ్చారు. ఆ చెక్కులు బ్యాంకులో చెల్లకపోవడంతో మోసపోయామని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాం. అయినా మాకు న్యాయం జరుగడం లేదు. మా భూమిని మాకు తిరిగి ఇప్పించి పట్టా చేయాలి.

- కావలి లక్ష్మయ్య, బాధిత రైతు, అంతారం, కులకచర్ల

బీజాపూర్ హైవేపై బ్లాక్ స్పాట్ల గుర్తింపు


బ్లాక్ స్పాట్స్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

పూడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్స్‌ను పోలీసులు గుర్తించారు. బుధవారం పూడూరు మండల పరిధిలో హైవేపై పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి, చెన్‌గోముల్ ఎస్ఐ భరత్ కుమార్‌రెడ్డి, డీఈ నరేందర్ కలిసి తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించారు. ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. రోడ్లపై గుంతలకు మరమ్మతులు, రోడ్ల పైకి వచ్చిన చెట్లను తొలించడం వంటి పనులు చేయనున్నట్లు తెలిపారు. రోడ్డుపై సూచిక బోర్డు, డబుల్ లైన్, సింగల్ లైన్, బ్రోకెన్ లైన్ స్పష్టంగా కనిపించే విధంగా ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. మలుపుల వద్ద బార్డర్స్ సోలాల్ బ్లింకర్స్, సోలార్ స్టడ్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

రోడ్డెక్కుతున్న వడ్లు!

కల్లాలు లేక రహదారులపైనే ఆరబోత


అంగడిరైచూర్ - టేకుల్‌కోడ్ రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

అంతంతమాత్రంగానే కల్లాల నిర్మాణం
తప్పక రోడ్లను ఆశ్రయిస్తున్న రైతులు
జిల్లాకు 585 కల్లాలు మంజూరు
నిర్మాణం పూర్తయినవి 227 మాత్రమే..

మేడ్చల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ధాన్యం ఆరబోసేందుకు మైదానాలు కానరావడం లేదు. కల్లాల నిర్మాణాలు అంతంతమాత్రంగానే ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం ఆరబోసేందుకు చోటు లేక రోడ్లను ధాన్యంతో నింపేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలోని అన్ని గ్రామాల్లో వరి సాగు విస్తీర్ణం పెరిగింది. ధాన్యం దిగుబడి కూడా ఎక్కువగానే వస్తోంది. కల్యాలు లేక రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబోస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

కల్లాల నిర్మాణాలకు రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఐదు ఎకరాలలోపు

మిగతా 8వ పేజీలో...

జోరుగా వరి కోతలు

జిల్లాలో ప్రస్తుతం వరి కోతలు ముగింపు దశకు చేరుకున్నాయి. జిల్లాలో 17,855 ఎకరాల్లో వరి సాగు చేశారు. ధాన్యం ఆరబోసేందుకు పొలాల్లో చోటు లేకపోవడం, బురద ఉండటంతో ఎక్కువ మంది రైతులు ధాన్యాన్ని రోడ్లపైనే ఆరబోస్తున్నారు. పొలాల్లో కల్లాలు చేసే పరిస్థితి లేక, రోడ్లపై ఆరబోస్తే త్వరగా ఎండుతుండటంతో ఎక్కువ మంది రైతులు రోడ్లపైనే ఆరబోస్తున్నారు. అకాల వర్షం వచ్చినా ఇబ్బంది లేకపోవడం, త్వరగా కుప్ప నూర్చడం సులువుగా ఉండటంతో ధాన్యాన్ని రోడ్లపై పోస్తున్నారు.


అందెశ్రీకి నివాళులర్పిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్

తెలంగాణ ఓ మహా కవిని కోల్పోయింది

» అందెశ్రీ సంతాప సభలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సహజకవి, ప్రముఖ రచయిత అందెశ్రీని కోల్పోయినప్పటికీ తెలంగాణ ప్రజల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అవుశాపూర్ డీజీఆర్ కన్వెన్షన్ హాలులో బుధవారం సహజ కవి, ప్రముఖ రచయిత అందెశ్రీ సంతాప సభకు హాజరై అందెశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందెశ్రీ తాపీమేస్త్రీగా జీవితం ప్రారంభించి మహాకవిగా తన ప్రస్థానాన్ని ముగించిన మహోన్నతమైన వ్యక్తి అన్నారు. అనంతరం అందెశ్రీ సతీమణిని, కుటుంబసభ్యులకు ఓదార్చి ధైర్యం చెప్పారు. అందెశ్రీ కుమారుడికి అసిస్టెంట్ ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నెలలో రవీంద్రభారతీలో నిర్వహించే అందెశ్రీ సంస్మరణసభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని అతడి కుమారుడికి ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

పీడిత వర్గాల కోసమే అందెశ్రీ కవితలు: ఎంపీ ఈటల రాజేందర్

పేద, పీడిత వర్గాల ప్రజల అభ్యున్నతి కోసమే అందెశ్రీ కవితలు, రచనలు రచించాడని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. అందెశ్రీ సంతాప సభలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భౌతికంగా మన మధ్య అందెశ్రీ లేకపోయినప్పటికీ ఆయన పాటలు, రచనలు, ఆశయాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ కమిషనర్ అయోధ్యరెడ్డి, సమాచార శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ కొదండరామ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, సినీ నటుడు నారాయణమూర్తి, మాజీ జెడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, జయరాజ్, ప్రొఫెసర్ శ్రీరామ్, పాశం యాదగిరి, విమలక్క, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, కవులు, కళాకారులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.


ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుకు భూ కేటాయింపు

224.04 ఎకరాలకు ప్రొసీడింగ్స్ అందజేత

దుద్యాల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హకీంపేట్, లగచర్ల, పోలెపల్లి గ్రామాల పరిధిలో ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు రైతుల నుంచి సేకరించిన 224.04 ఎకరాలను విద్యాసంస్థల కోసం కేటాయించారు. వీటికి సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను ఆయా శాఖల అధికారులకు తహసీల్దార్ కిషన్‌నాయక్, ఆర్ఐ నవీన్‌కుమార్ బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో అందించారు.

భూ కేటాయింపులు ఇలా..

ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 15.49 ఎకరాలు, ప్రభుత్వ మెడికల్ ఆసుపత్రి, నర్సింగ్, పారామెడికల్, ఫిజియోథెరపీ కళాశాలలకు 22.42 ఎకరాలు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఏటీసీ కేంద్రం నిర్మాణానికి 3.14 ఎకరాలు, పశువైద్య కళాశాలకు 27.19 ఎకరాలు, సైనిక్ స్కూల్‌కు 11.69 ఎకరాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు 20 ఎకరాలు, ఫైర్ స్టేషన్‌కు ఎకరా, పోలీస్‌స్టేషన్‌కు 99 సెంట్లు, ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి ఎకరా, విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి 1.89 ఎకరాలు, ఇతర నిర్మాణాల కోసం 114 ఎకరాలు కేటాయించారు.


ప్రొసీడింగ్స్ అందిస్తున్న తహసీల్దార్ కిషన్‌నాయక్

రామలింగేశ్వరుడి సేవలో కవిత



కీసర, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామిని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బుధవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మహా మండపంలో అర్చకులు కవితకు స్వామివారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాములతోపాటు అశీర్వచనాలు అందజేశారు. అనంతరం కీసరగుట్టలో జరిగిన అయ్యప్ప స్వామి మహా పడిపూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి, ఫౌండర్ సభ్యులు, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్లేట్ ఫిరాయింపుదారులపై కొరడా

తప్పుడు నంబర్ ప్లేట్‌తో వాహనాలు
జిల్లా వ్యాప్తంగా 3,325 వెహికిల్స్ సీజ్
నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చర్యలు

వికారాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై పోలీసులు కొరడా ఝులిపించారు. సరైన నంబర్ ప్లేట్లు, టాంపరింగ్ చేసిన.. అక్రమ నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనాలను సీజ్ చేశారు. అక్టోబరులో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో నంబర్ ప్లేట్ నిబంధనలు ఉల్లంఘించిన 3,325 వాహనాలను సీజ్ చేశారు.

డివిజన్ల వారీగా సీజ్ చేసినవి..

అత్యధికంగా పరిగి సబ్ డివిజన్ పరిధిలో 1,843 వాహనాలను సీజ్ చేయగా, వికారాబాద్ సబ్ డివిజన్ పరిధిలో 1,085 వాహనాలు, తాండూరు సబ్ డివిజన్ పరిధిలో 397 వాహనాలను సీజ్ చేశారు. పరిగి పోలీసు స్టేషన్ పరిధిలో 575 వాహనాలు, చెన్‌గోముల్‌లో 512, కులకచర్లలో 204, దోమలో 189, బొంరాస్‌పేట్‌లో 158, దౌల్తాబాద్‌లో 69, దుద్యాల్‌లో 73 వాహనాలు నెంబర్ ప్లేట్ నిబంధనలను అతిక్రమించినట్లు గుర్తించి సీజ్ చేశారు. వికారాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో 639 వాహనాలను సీజ్ చేయగా, కోట్‌పల్లిలో 84, బంట్వారంలో 87, ధారూరులో 69, నవాబ్‌పేట్‌లో 67, మర్పల్లిలో 65, మోమిన్‌పేట్‌లో 74 వాహనాలను సీజ్ చేశారు. కరణ్‌కోట్‌లో 130 వాహనాలను సీజ్ చేయగా, తాండూరులో 119, బషీరాబాద్‌లో 99, పెద్దేముల్‌లో 44, యాలాల్‌లో 5 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు.



నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



రోడ్డు భద్రత, నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో నంబర్ ప్లేట్ నిబంధనలను ఉల్లంఘించిన వాహనాలను సీజ్ చేశాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి వాహహనదారుడు సరైన నంబర్ ప్లేట్ కలిగి ఉండాలి. ప్రతినెలా ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

- ఎస్పీ నారాయణరెడ్డి

సాధారణ, వ్యయ పరిశీలకుల నియామకం



వికారాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు జిల్లాల వారీగా సాధారణ, వ్యయ పరిశీలకులను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. వికారాబాద్ జిల్లా సాధారణ పరిశీలకులుగా హార్టికల్చర్ అండ్ సెరికల్చర్ డైరెక్టర్ షేక్ యాస్మీన్ భాష, వ్యయ పరిశీలకులుగా మహబూబ్‌నగర్ జిల్లా ఆడిట్ అధికారి ఎం.రమేష్‌కుమార్‌ను నియమించారు. రంగారెడ్డి జిల్లా సాధారణ పరిశీలకుడిగా ఇరిగేషన్ అండ్ క్యాచ్‌మెంట్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి పాటిల్ ప్రశాంత్ జీవన్, వ్యయ పరిశీలకుడిగా రాష్ట్ర ఆడిట్ డైరెక్టరేట్‌లో జిల్లా అడిట్ అధికారిగా పనిచేస్తున్న నార్యలను నియమించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియను సాధారణ పరిశీలకులు పరిశీలించనుండగా, ఎన్నికల్లో అభ్యర్థులు చేసే ఖర్చులను వ్యయ పరిశీలకులు పరిశీలిస్తారు.

బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చంద్రశేఖర్

తాండూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని బహుజన సమాజ్ వాదీ పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్రకో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. తాండూరుకు చెందిన ఆయన పార్టీ అధినేత్రి మాయవతిని కలిసి రాష్ట్రంలో పార్టీ పరిస్థితిపై వివరించారు. లోక్‌సభ ఎన్నికలు ఎప్పుడైనా రావొచ్చని, అందుకు పార్టీ శ్రేణులను సిద్ధం చేయాలని చెప్పారన్నారు.

విద్యార్థుల ఆచూకీ లభ్యం

తాండూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తాండూరులోని ఎన్టీఆర్ కాలనీలోని తెలంగాణ సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి మోత్కుపల్లికి చెందిన 8వ తరగతి విద్యార్థి వినయ్‌కుమార్, 9వ తరగతి విద్యార్థి హర్షవర్ధన్‌లు బుధవారం ఉదయం బయటకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పేరెంట్స్ వెంటనే హాస్టల్‌కు చేరుకొని విచారించారు. చివరకు సీసీ కెమెరాల ఆధారంగా విద్యార్థులు మోమిన్‌పేట్‌లో దొరికారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

శామీర్‌పేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రిని పురస్కరించుకొని శామీర్‌పేటలోని భవానీరామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానార్చకుడు మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, మంత్ర పుష్పం, అర్చన, తీర్థప్రసాద వితరణ చేశారు. భజన మండలి బృందాల ఆధ్వర్యంలో భజనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు



మాట్లాడుతున్న చినజీయర్ స్వామి

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

మహేశ్వరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి తెలిపారు. బుధవారం మహేశ్వరం మండలం మన్‌సాన్‌పల్లి కొత్తతండాలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ కన్వెన్షన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన అనంతరం జీయర్ మాట్లాడుతూ కల్యాణ మండపాలైనా, కన్వెన్షన్ హాల్స్ అయినా.. శుభకార్యాలకు మాత్రమే ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలన్నారు. అదేవిధంగా డిసెంబరు 1న భగవద్గీత ఆవిర్భావ దినోత్సవాన్ని ముచ్చింతల్‌లోని శ్రీ శ్రీమన్నారాయణ సన్నిధిలో నిర్వహిస్తున్నామని, భక్తులు అధికసంఖ్యలో హాజరు

గడువులోగా హైవే విస్తరణ పనులు పూర్తి

చేవెళ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయిస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. బుధవారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అలాగే చేవెళ్ల మండల పరిధిలోని దామరగిద్ద గ్రామ పరిధిలో పత్తి మిల్లు వద్ద కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే యాదయ్య ప్రారంభించారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ ఛైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్‌ఛైర్మన్ రాములు, మాజీ సర్పంచులు, వీరేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.

వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలివ్వాలి

వికారాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, చనిపోయిన కుటుంబాలకు ప్రమాదబీమా, ఉద్యోగం ఇవ్వాలని సీఐటీయూ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మహిపాల్ పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్‌లోని ఎమ్మెల్యే కార్యాలయాన్ని వీఆర్ఏలు ముట్టడించారు. గతంలో ప్రభుత్వం వీఆర్ఏలకు ఇచ్చిన హామీలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21న కలెక్టరేట్ ముట్టడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, జనార్ధన్, రాజు సంగమేశ్, శ్రీనివాస్, రమేష్, గోపాల్, నర్సిములు, అనంతయ్య, సంగమేశ్, మోహన్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కేంద్రం పెద్దపీట

చేవెళ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ నిధులు మంజూరు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తెలిపారు. బుధవారం చేవెళ్ల మండలం ధర్మసాగర్‌లో ఎంపీ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులు గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్ ముదిరాజ్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు డాక్టర్ వైభవ్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, బోజిరెడ్డి, కృష్ణ, వెంకటేశ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

జిల్లా యువజనోత్సవాలు-2025

పోటీల్లో పట్నం విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డా.రాధిక తదితరులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా యువజనోత్సవాలు-2025 పోటీల్లో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సాహిత్య, సాంస్కృతిక విభాగాల్లో చక్కటి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక తెలిపారు. కథా రచనలో బీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని టీనాకుమారి మొదటి బహుమతి, కవితా రచనలో బీకాం ప్రథమ సంవత్సరం విద్యార్థి సాయికృప ద్వితీయ బహుమతి, చిత్రలేఖనంలో బీకాం ప్రథమ సంవత్సరం విద్యార్థిని రజిత ద్వితీయ బహుమతి సాధించారని చెప్పారు. డా.చింతల రాకేష్ భవానీ, అధ్యాపక బృందం అభినందించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డా.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మరికొన్ని గంటల్లో డెలివరీ... అదృశ్యమైన గర్భిణి

- కింగ్‌కోఠి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఘటన
- బాధితురాలిది మంచాల మండలం కాగజ్‌ఘట్ గ్రామం

మంచాల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మరికొన్ని గంటల్లో డెలివరీ కావాల్సిన గర్భిణి ఇంతలోనే ఆసుపత్రి అవరణలో నుంచి కనిపించకుండా పోయింది. ఈ ఘటన నగరంలోని కింగ్‌కోఠి ప్రసూతి ఆసుపత్రిలో జరిగింది. బాధితురాలిది రంగారెడ్డి జిల్లా, మంచాల మండల పరిధి కాగజ్‌ఘట్ గ్రామం. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన స్వప్న(25) తన భర్త శివకుమార్‌తో కలిసి మంగళవారం కింగ్‌కోఠిలోని ప్రసూతి ఆసుపత్రికి వెళ్లింది. ఆసుపత్రి ఆవరణలో కొద్దిసేపు భర్తతో కలిసి ఉన్నస్వప్న కొద్దిసేపటికీ చెప్పాపెట్టకుండా బయటకు వెళ్లి అటు నుంచి ఆటోఎటో వెళ్లిపోయింది. భార్య ఎంతసేపటికీ రాకపోవడంతో ఆందోళన చెందిన శివకుమార్ సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గర్భిణి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.

విమానంలో ప్రయాణికుడికి అస్వస్థత

శంషాబాద్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి భువనేశ్వర్‌కు వెళ్తున్న ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానంలో అన్షుమాన్ చక్రవర్తి అనే ప్రయాణికుడు అస్వస్థతకు గురయ్యాడు. అతను ఆకస్మాత్తుగా అపస్మారక స్థితిలో పడిపోవడంతో వెంటనే ఎయిర్‌పోర్టు మెడికల్ సెంటర్‌కు సమాచారం అందించారు. ఎయిర్‌లైన్స్ సిబ్బంది ఎస్కార్ట్‌లో ప్రయాణికుడిని అపోలో ఏఎంసీ బేస్‌మెంట్‌కు తరలించారు. అత్యవసర చికిత్స కారణంగా తదుపరి ప్రయాణాన్ని కోల్పోయిన కారణంగా ఆ ప్రయాణికుడిని ఆఫ్‌లోడ్ చేసింది. చికిత్స పొందిన తర్వాత ప్రయాణికుడు పీటీబీ నుంచి ఆఫ్ లోడింగ్ ఫార్మాలిటీలను పూర్తి చేసేందుకు ఎయిర్‌లైన్స్ సిబ్బందితో ఏఎంసీ నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. అదే విధంగా హైదరాబాద్ నుంచి రాజమండ్రికి ఇండిగో విమానంలో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు తన మామ యశోద ఆసుపత్రిలో చేరడంతో స్వయంగా ఆఫ్‌లోడ్ చేశారు. మిగతా ప్రయాణికులను సంబంధిత ఎయిర్‌లైన్స్ సిబ్బంది తదుపరి ఆఫ్‌లోడింగ్ ఫార్మాలిటీల కోసం దేశీయ బదిలీల ప్రాంతానికి తిరిగి తీసుకొచ్చారు.

ఎమిరేట్స్ విమానాన్ని ఢీకొన్న పక్షి?

శంషాబాద్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దుబాయ్ వెళ్తున్న ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ ఈకే 529 విమానం బుధవారం రాత్రి 9.25 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ తీసుకుంది. ఆ సమయంలో విమానాన్ని పక్షి ఢీకొన్నట్లు అనుమానించిన పైలెట్ ఏటీసీ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఏటీసీ అధికారులు సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. అధికారులు రన్‌వేపైకి వెళ్లి చూడగా అక్కడ పక్షి ఆనవాళ్లు లేవని నిర్ధారించారు. అదే విషయం ఏటీసీ అధికారులు తిరిగి పైలెట్‌కు సమాచారం అందించారు. దీంతో విమానం దుబాయ్ బయలుదేరి వెళ్లింది.

వెలుగులోకి జ్యువెలర్ షాపు యజమాని మోసాలు

- మూసి ఉన్న దుకాణం వద్ద బాధితుల ఆందోళన

కులకచర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కులకచర్లలో అజయ్ జ్యువెలర్స్ షాపు యజమాని నరేందర్ చౌదరి మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకొస్తున్నాయి. బుధవారం బాధితులు షాపు వద్దకొచ్చారు. జ్యువెలర్స్ షాపులో బంగారం తాకట్టు పెట్టిన వారు, అప్పు ఇచ్చిన వారు లబోదిబోమంటున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. నరేందర్‌చౌదరి కొందరి బంగారం తాకట్టు పెట్టుకొని డబ్బులు ఇవ్వలేదు. కొందరి వద్ద రూ.లక్షల్లో అప్పుచేసి గత శనివారం కుటుంబ సభ్యులతో పరారైన విషయం తెలిసిందే. రూ.2కోట్లకుపైగానే ఖాతాదారులకు డబ్బులివ్వాల్సి ఉందని చెబుతున్నారు. ఆగ్రహంతో బాధితులు మార్వాడీ బంగారు దుకాణాలను బంద్ చేయించారు. బాధితుడు గోపాల్‌నాయక్ మాట్లాడుతూ.. తాను నరేందర్‌చౌదరికి రూ.13లక్షలు అప్పు ఇచ్చానన్నాడు. మరో రూ.10లక్షలకు జమానత్ ఉన్నట్టు తెలిపాడు. మరో బాధితురాలు మంగమ్మ మాట్లాడుతూ.. తనకు అభరణం చేసివ్వాలని 15గ్రాముల బంగారం ఇచ్చానంది. బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. నరేందర్‌కు తాను 5లక్షల నగదు, 3తులాల బంగారు గొలుసు ఇచ్చానన్నాడు. అతడి మాయమాటలకు మోసపోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు అతడిని పట్టుకొని తమ డబ్బు, బంగారాన్ని రికవరీ చేయాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కులకచర్లలో అజయ్ జ్యువెలర్ షాపు ఎదుట బాధితులు

అధికారులు అలసత్వానికి తావివ్వొద్దు

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల లక్ష్యాల పూర్తిలో అధికారులు అలసత్వానికి తావివ్వకూడదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. అవినీతి, అక్రమాలకు చోటు లేకుండా, లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్నిస్థాయిల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఆమనగల్లు, కడ్తాల్, కల్వకుర్తి మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. ఎంపీడీవోలు మాధురి, సుజాత, శ్రీకాంత్, విజయలక్ష్మి, కమిషనర్ శంకర్ నాయక్, శాలిని, శ్రీనివాస్ రెడ్డి, ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, గూడూరు భాస్కర్ రెడ్డి, యాట నర్సింహ్మా, భృంగి ఆనంద్ కుమార్, అశోక్‌రెడ్డి, పర్వత్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కడ్తాల్ : మండల పరిధిలోని మైసిగండికి చెందిన పూజారి బీచ్యనాయక్ సతీమణి రామావత్ లక్ష్మి అనారోగ్యంతో మృతిచెందింది. బుధవారం మృతదేహాన్ని మైసిగండిలోని ఆమె నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. బీచ్యనాయక్, కుటుంబసభ్యులను పరామర్శించారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, సిరోలి పంతూ, కమ్లీ మోత్యనాయక్, తులసీరామ్ నాయక్, శేఖర్‌గౌడ్, పాండునాయక్, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే సమన్యాయం

షాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే బడుగు, బలహీన వర్గాలకు సమన్యాయం చేకూరుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎల్గొండగూడలో బీఆర్ఎస్ గ్రామ పంచాయితీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రఘునందన్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు 50 మంది నాయకులు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు దశలవారీగా అమలు చేస్తుందన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, ప్రతాప్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌గౌడ్, చేవెళ్ల స్వామి, ఖాజామియాపటేల్, అంజనేయులుగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, రాహుల్‌గుప్తా, రవీందర్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, నర్సింహులు, కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, రాఘవేందర్, సూర్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జాంగీర్, రమేష్, మహేష్, కిషోర్, నరేందర్ పాల్గొన్నారు.



మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

నేటి బాలలే రేపటి పౌరులు



వేడుకల్లో విజయలక్ష్మి, శ్రీధర్, అంగన్‌వాడీలు, చిన్నారులు

శామీర్‌పేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నేటి బాలలే భావి పౌరులని, అంగన్‌వాడీల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్నామని హెచ్‌బీఎల్ సీఎస్ఆర్ అసోసియేట్ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం తూంకుంట పరిధి 17అంగన్‌వాడీ కేంద్రాల్లో తమ సంస్థ ఏడో వార్షికోత్సవాలను, బాలల దినోత్సవాన్ని హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ పరిశ్రమ సీఎస్ఆర్ అసోసియేట్ విజయలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ శ్రీధర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవరయంజాల్, తూంకుంట, హకీంపేట, పోతాయిపల్లి, సింగాయిపల్లిల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లలు, వారి తల్లులు వేడుకల్లో పాల్గొన్నారు. తూంకుంట, అలియాబాద్ మునిసిపాలిటీల్లోని అంగన్‌వాడీ సెంటర్లను తాము దత్తత తీసుకొని పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

కొడంగల్ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అగాఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు, ఆశా కార్యకర్తలకు కొడంగల్‌లో ఈసీడీపై శిక్షణ ఇచ్చారు. పిల్లల శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధికి సంబంధించిన అంశాలు, పోషకాహార పంపిణీ, టీకాలు వేయడం, ఆరోగ్య తనిఖీలు, కథల ద్వారా అభ్యసన తదితరాలపై శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో సీడీపీవో రూప, సూపర్‌వైజర్లు, ఫౌండేషన్ ఈసీడీ ప్రాజెక్ట్ సిబ్బంది సుమలత, మమత, సంపత్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, ఎంఐఎం నేతలు

కాంగ్రెస్‌లో చేరిక

తాండూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):తాండూరులో బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల ముఖ్య నేతలు నయీం, సాజిత్‌లను కాంగ్రెస్‌లో చేరారు. గతంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడిగా ఉన్న నయీం(అప్పు), అప్పటి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్‌లో చేరి పట్టణాధ్యక్షుడిగా, ఆయన సతీమణి కౌన్సిలర్‌గా పనిచేశారు. ఆయన సమీప బంధువు ముక్తార్‌నాజ్ సైతం కౌన్సిలర్‌గా గెల్చారు. స్టోన్ ట్రేడర్స్ అసోసియేషన్ ప్రతినిధిగా ఉన్న నయీం, ముక్తార్‌నాజ్‌తో కలిసి కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్‌కు పట్టణంలో బలం తగ్గినట్టయింది. అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు హైదరాబాద్‌లోని నయీం ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే ఎంఐఎంలో క్రియాశీలకంగా పనిచేసిన మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ సాజిత్ సైతం కాంగ్రెస్‌లో చేరారు. సాజిత్ సతీమణి కూడ కౌన్సిలర్ గెల్చారు. వీరి చేరికతో తాండూరు మునిసిపాలిటీలో హస్తం పార్టీ మరింత బలోపేతం అవుతుందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హబీబ్ లాల ధీమా వ్యక్తం చేశారు.



నయీంతో చర్చిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పక్కాగా పెన్షన్ పంపిణీ చేయాలి

- మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

మేడ్చల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ పక్కాగా జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో చేయూత పెన్షన్లపై సెర్ప్ పెన్షన్ విభాగానికి చెందిన డైరెక్టర్ గోపాల్‌రావు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్, డీఆర్‌డీఓ సాంబశివరావు, జీహెచ్ఎంసీ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎండీఓలు, పోస్టల్ డిపార్ట్‌మెంట్, బిల్‌కలెక్టర్, వార్డు ఆఫీసర్లు, సెక్రటరీ డీపీఎం పెన్షన్ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, కల్లు గీత కార్మికులు, చేనేత కార్మికులు, బీడీ కార్మికులు, బీడీ టేకేదార్లు, ఎయిడ్స్ పైలేరియా, డయాలసిస్ బాధితులకు వాటికి సంబంధించి పెన్షన్లపై అవగాహన కల్పించారు. జిల్లాలో లక్షా 42 వేల 383 మంది లబ్ధిదారులు ప్రతి నెలా రూ.34 కోట్ల 40 లక్షల 92 వేలు ఆర్థికసాయం పొందుతున్నారని వివరించారు. ఫేషియల్ రికగ్నైజేషన్ ఆప్ ద్వారా పెన్షన్ల పంపిణీ జరుగుతుందని, నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్స్ ప్రకారం కుటుంబ పెద్ద చనిపోయినట్లయితే ఆ కుటుంబానికి రూ.20 వేలు అందుతాయన్నారు. అనంతరం డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో చేయూత పెన్షన్‌లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

ఎన్కతల శివారులో చిరుత కలకలం



మోమిన్‌పేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్కతల శివారులో బుధవారం చిరుత పులి సంచారం కలకలం రేపింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఎన్కతల ఇండస్ట్రియల్ పార్కుకు కేటాయించిన ప్రాంతంలో బుధవారం చిరుత కనిపించిందని అందులో పని చేస్తున్న రమేశ్ తెలిపాడు. దీంతో ఇండస్ట్రియల్ పార్కు పరిధిలో పని చేస్తున్న ఇంజినీర్లు, కూలీలు, డ్రైవర్లు, స్థానికులు, రైతులు భయాందోళనకు గురయ్యారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా అధికారులు అక్కడికి పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా పొలాలకు వెళ్లొద్దని సూచించారు.

బస్సు ప్రమాద బాధితులకు చెక్కుల అందజేత



బాధితులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడిన పది మందికిగాను ఒక్కొక్కరికి రూ.2లక్షల చెక్కులను బుధవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ బాల్‌రెడ్డి, తహసీల్దార్ తారాసింగ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, నాయకులు ఉత్తమ్‌చంద్, సంపత్‌కుమార్ ఉన్నారు.

బీసీల ద్రోహి కాంగ్రెస్



మాట్లాడుతున్న శుభప్రద్ పటేల్

వికారాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈసీలను కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి మోసం చేస్తున్నారని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. బుధవారం వికారాబాద్‌లోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి బీసీలకు 42శాతం రిజర్వేషన్లను పార్టీ పరంగా ఇస్తే ఒప్పుకోం అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను ప్రభుత్వం ఎందుకు నిలపెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్రం నుంచి రిజర్వేషన్లు సాధిస్తామన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారో తెలపాలన్నారు. ఎన్నికలు నిర్వహించక పల్లెల్లో అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లలో ఒక్క శాతం తగ్గినా బలహీన వర్గాల ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు.

ఎల్వోసీ అందజేసిన స్పీకర్

ధారూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మున్నూరు సోమారానికి చెందిన వడ్ల సుగుణమ్మ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.1.25లక్షల విలువైన ఎల్వోసీని అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు గోవర్ధన్ ఉన్నారు.

సదస్సులతో మేధాశక్తిని పెంచుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం అంతర్జాతీయ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ)ను ప్రారంభించారు. ఐటీ విభాగంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ విద్యాసంస్థల నుంచి 170మంది పాల్గొన్నారు. వర్సిటీ ఐటీ విభాగాధిపతి నీతిషాశర్మ మాట్లాడుతూ... విద్యార్థులు అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని మేధాశక్తిని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీపీ కన్వీనర్లు ఆశాకిరణ్, పద్మజా, కుమార్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏఆర్ఎఫ్ఎఫ్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్

శంషాబాద్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏఆర్ఎఫ్ఎఫ్ ఆధ్వర్యంలో అగ్నిమాపక తరలింపు మాక్ డ్రిల్ నిర్వహించారు. బుధవారం నోవాటల్‌లో అగ్నిమాపక తరలింపు మాక్ డ్రిల్‌లో వివిధ ఏజెన్సీలకు చెందిన మొత్తం 181 మంది సిబ్బంది పాల్గొన్నారు. మాక్ డ్రిల్‌లో నోవాటెల్ సిబ్బంది 162 మంది, ఏఆర్ఎఫ్ఎఫ్ నలుగురు, అపోలో సిబ్బంది ముగ్గురు, రాక్సా సిబ్బంది 12 మంది పాల్గొన్నారు.

యాంటీబయాటిక్ వాడకంపై సదస్సు

మేడ్చల్ టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అతిగాయాంటీ బయాటిక్ మందుల వాడటంతో ఉత్పన్నమవుతున్న దుష్పరిణామాలపై బుధవారం మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విచ్చలవిడిగా యాంటీబయాటిక్‌ల వాడకంతో ఆరోగ్యరంగా దుష్పరిణామాలు ఎదురవుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరించారు. దానివాడకాన్ని తగ్గించి సురక్షిత వైద్యాన్ని అందించే విధానాలపై చర్చించారు.



సదస్సులో పాల్గొన్న వైద్యులు

అధ్వానంగా రోడ్డు.. ఇబ్బందుల్లో ప్రజలు

నవాబుపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నవాబుపేట మండలంలోని అక్నాపూర్ నుంచి సిద్ధలూర్ వరకు రోడ్డు అధ్వానంగా మారి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని మాజీ సర్పంచ్ గోపాల్‌గౌడ్ అన్నారు. బుధవారం మాట్లాడుతూ.. అక్నాపూర్ నుంచి సిద్ధలూర్ వరకు ప్రయాణించాలంటే నరకయాతన తప్పడం లేదన్నారు. అధికారులు రోడ్డు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలన్నారు.

కర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే



కిష్టారెడ్డి దశ దిన కర్మకు హాజరైన మాజీ ఎమ్మెల్యే మహే‌ష్‌రెడ్డి

పూడూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రేగడిమామిడిపల్లికి చెందిన కిష్టారెడ్డి దశ దినకర్మ బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి పరిగి మాజీ ఎమ్మెల్యే మహే‌ష్‌రెడ్డి హాజరై సంతాపం తెలిపారు. మృతుడి కుమారులు జంగారెడ్డి, మాసిరెడ్డిలను పరామర్శించారు. ఆయనతో మార్కెట్ కమిటీ చైర్మన్ అజారుద్దీన్, నాయకులు నిర్మ, మహిపాల్‌రెడ్డి, అంజిరెడ్డి, ప్రకా‌ష్‌రెడ్డి, గొవర్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అంజనేయులు, మల్లేష్, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎంపీకి బీజేపీ నాయకుల పరామర్శ

తాండూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లో జిల్లా బీజేపీ నాయకులు పరామర్శించారు. పార్టీ కన్వీనర్ కరుణం ప్రహ్లాద్‌రావు, నాయకులు మాధవరెడ్డి, తాండూరు నాయకులు కృష్ణం, భద్రేశ్వర్ పరామర్శించి ఎంపీ త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

కులకచర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం ముజాహిద్‌పూర్ గ్రంథాలయాన్ని పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో మినీ గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు.

పరిగి శివారులో ఉద్యాన మార్కెట్



మార్కెట్ యార్డులో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పరిగి మండలం రంగంపల్లి శివారులో జిల్లా స్థాయి ఉద్యాన పంటల మార్కెట్‌ను ఏర్పాటు చేయబోతున్నామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మార్కెట్ యార్డులో రూ.2కోట్లతో చేపట్టనున్న రేకులషెడ్డు, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రంగంపల్లిలో ఇప్పటికే ఉద్యాన మార్కెట్‌కు 25ఎకరాలను గుర్తించామని తెలిపారు. ఉద్యాన పంటల రైతులు పండ్లు, పూలను ఇక్కడే విక్రయించుకోవచ్చన్నారు. పరిగి మార్కెట్ యార్డులో కొత్త కార్యాలయం, రైతుల అతిథి గృహం, నిర్మిస్తామని తెలిపారు. ఓఆర్ఆర్ నుంచి లగచర్ల వరకు నియోజకవర్గం మీదుగా రేడియల్ రోడ్డు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో పరిగి, కులకచర్ల ఏఎంసీ చైర్మన్లు పరశురాంరెడ్డి, బీఎస్.ఆంజనేయులు, నాయకులు శ్రీనివా‌స్‌రెడ్డి, పార్థసారథి, కృష్ణ, యాదవరెడ్డి, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య, ఎంపీడీవో హరిప్రియం, ఎంపీవో కరీం పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందజేత

చౌడాపూర్: పేదలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. చౌడాపూర్‌లో రూ.1.43కోట్లతో ప్రభుత్వాసుపత్రి నిర్మాణానికి అధికారులు, నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అలాగే చౌడాపూర్‌లోని రైతు వేదికలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సోమలింగం, ఎస్సై రమేశ్, ప్యాక్స్ చైర్మన్ మొగులయ్య, భీమ్‌రెడ్డి, ఏఈ ఉమేశ్, ఏవో షర్మిల, పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, చౌడాపూర్, కులకచర్ల మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్‌కుమార్, బీఎస్.అంజనేయులు, ఉపాధ్యక్షుడు నర్సింహానాయక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శివరాంనాయక్, వెంకటయ్య గౌడ్, సలీం, మాజీ సర్పంచ్ శేఖర్, రాము, నరేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక కేంద్రంగా ఈ ప్రాతం

కులకచర్ల: త్వరలోనే ఈ ప్రాంతం పారిశ్రామిక కేంద్రంగా మారనుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కులకచర్ల బస్టాండ్ ఆవరణలో ఉపాధి నిధులు రూ.12.75లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రీజనల్ రింగ్ రోడ్డు నుంచి దోమ నుంచి నాలుగు లేన్ల రోడ్డు లగచర్లకు వెళ్తుందన్నారు. దీంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ బ్లాక్-2 అధ్యక్షుడు భరత్‌కుమార్, గోపాల్, ఈఈ ఉమేశ్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ మనోహర చక్రవర్తి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై దృష్టి పెట్టండి



తాండూరు మండల పరిషత్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తాండూరు నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలువగా రూ.5కోట్లు మంజూరు చేశారని, వాటితో గ్రామాల్లో మౌలిక సదుపాయలు కల్పిస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం తాండూరు మండల పరిషత్‌లో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో మొక్కల పెంపకంలో తేడావస్తే వారిని ఇంటికి పంపించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్లాన్‌టేషన్ కోసం ప్రభుత్వం ఎంతో డబ్బు వెచ్చిస్తోందని చెప్పారు. డిసెంబరులో నిర్వహించే ప్రజాపాలన వారోత్సవాల్లో గ్రామాల్లో పనుల న్నింటినీ పరిశీలిస్తామని తెలిపారు. మొక్కలు లేకున్నా, ఎండినా ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులను ఇంటికి పంపుతామన్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని కార్యదర్శులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. మిషన్ భగీరథ ఏఈ ప్రతిభ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణిత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంలో కార్యదర్శులు, అధికారులు సమన్వయంతో పనిచేసి లబ్ధిదారులకు త్వరగా బిల్లులందేలా చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో 50 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్టు అధికారులు తెలిపారు. లబ్ధిదారులకు ఐకేపీ ద్వారా మరో లక్ష సహాయం అందిస్తామని, ఈ సమాచారాన్ని వారికి తెలియజేయాలని కోరారు. రైతులు పండించిన పంటను నిల్వ చేసుకునేందుకు గోదాంల నిర్మాణానికి ప్రభుత్వం రూ.30లక్షలు మంజూరు చేస్తుందని, రైతులు ముందుకొస్తే నిధులు ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ సత్తార్, తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీవో విశ్వప్రసాద్, ఏఈలు రఘువీర్‌రెడ్డి, నందిని, ఏడీఏ కొమరయ్య ఉన్నారు.

రోడ్డెక్కుతున్న వడ్లు!

(ఐదో పేజీ తరువాయి)

ఉన్న రైతులు కల్లాలు నిర్మించుకునేందుకు గత ప్రభుత్వ హయాంలో అనుమతులిచ్చింది. 75, 60, 50స్క్వేర్ మీటర్లలో నిర్మించే కల్లాలకు రూ.75,65,50 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. రైతులు ముందుగా డబ్బు వెచ్చించి కల్లాలు నిర్మించుకోవాలి. తర్వాత ప్రభుత్వం బిల్లు చెల్లిస్తుంది. దీంతో రైతులు కల్లాలు నిర్మించుకునేందుకు ముందుకురావడం లేదు. ఐదెకరాలలోపు ఉన్న రైతులు కల్లం నిర్మాణం కోసం కొంత స్థలం కేటాయించాల్సి వస్తుంది. లక్ష్యం పూర్తి చేసేందుకు అధికారులు కొన్ని చోట్ల కాంట్రాక్టర్లతో పనులు చేయించినా ఫలితం లేకుండా పోతోంది. నిర్మించిన కల్లాలనూ రైతులు సద్వినియోగం చేసుకోవడం లేదు.

సగం నిర్మాణాలైనా పూర్తికాని వైనం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గతంలో ప్రభుత్వం 585 కల్లాల నిర్మాణాలకు అనుమతులిచ్చింది. కేవలం 227కల్లాల నిర్మాణాలు పూర్తయ్యాయి. కొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. పూర్తయిన కల్లాల్లో రైతులు ధాన్యం ఆరబోసుకునేందుకు, ఇతర పనులకు ఉపయోగించుకుంటున్నారు. కల్లాల నిర్మాణాలకు ఎన్ఆర్ఈజీఎస్ నుంచి నిధులు వెచ్చించగా తమ అనుమతి లేకుండా నిధులు ఎలా మళ్లిస్తారని గతంలో కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు చెప్పడంతో కల్లాల నిర్మాణాలను నిలిపివేశారు. రైతులు అనాసక్తి, కేంద్రం అడ్డంకులతో కల్లాల నిర్మాణం ముందుకుసాగడం లేదు.

హైవేపై ధాన్యం ఆరబోత



హైదరాబాద్-బీజాపూర్ హైవేపై కొడంగల్ శివారులో ఆరబోసిన వడ్లు

కొడంగల్ రూరల్: కల్లాలు లేకపోవడంతో ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని రైతులు హైవేలపై, గ్రామీణ రోడ్లపై ఆరబోస్తున్నారు. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కొడంగల్ మండలంలో చిన్ననందిగామా, ఐనేన్‌పల్లి, బూల్కాపూర్, చిట్లపల్లి తదితర గ్రామాల రైతులు నేరుగా పంట పొలాల నుంచి ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా తీసుకువచ్చి హైవేలపై ఆరబోస్తున్నారు. రోజంతా ధాన్యాం ఎండిన తర్వాత అక్కడే టార్పలిన్ కవర్లు కప్పి వదిలేయడంతో రాత్రి పూట వచ్చే వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంభయంగా ముందుకు పోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు రోడ్లపై ధాన్యం ఆరబోయకుండా రైతులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందిర విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె దేశానికి చేసిన సేవలను, ప్రజా సంక్షేమానికి పాటుపడిన విధానాన్ని వివరించారు. ఆమె చూపిన మార్గంలో మనందరం పయనించాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

\- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, నవంబరు 19



వికారాబాద్: ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



ఘట్‌కేసర్‌లో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మేడ్చల్ టౌన్: పట్టణంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



దేవరయంజాల్‌లో ఇందిరా గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వజ్రేశ్‌యాదవ్

సంక్షిప్తంగా..

ప్రజావసరమైన పనులు చేపడుతున్నాం

శామీర్‌పేట: ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను, మౌలిక వసతులను చేపడుతున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ అన్నారు. బుధవారం తూంకుంటకు వచ్చి మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో మొత్తం రూ.87 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ప్రజలకు రహదారి సౌకర్యం, నీటి పారుదల వ్యవస్థ, మౌలిక సౌకర్యాల కల్పన మరింత మెరుగు పడుతుందని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలుయాదవ్, ఎ-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కట్ట మైసమ్మ దేవాలయ చైర్మన్ మహేందర్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఎద్దు నాగేశ్, జైపాల్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్, తుంకి రమేశ్, తుంకి భిక్షపతి, లక్ష్మీనారాయణ, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాల కట్టడికి సీసీ కెమెరాలు దోహదం

దోమ: నేరాల కట్టడికి సీసీ కెమెరాలు దోహదపడతాయని ఎస్సై వసంత జాదవ్ అన్నారు. మల్లెపల్లిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్సై ప్రారంభించారు. గ్రామస్తులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, తహసీల్దార్ తారాసింగ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, నాయకులు ఉత్తమ్‌చంద్, డాక్టర్ సంపత్ కుమార్ తదితరులు ఉన్నారు.

సన్న వడ్లకు బోనస్ చెల్లిస్తాం

ధారూరు: కొనుగోలు కేంద్రాల్లో సన్న వడ్లకు ప్రభుత్వం బోనస్ చెల్లిస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ వై.సత్యనారాయణ రెడ్డి తెలిపారు. గురుదోట్ల, మోమిన్‌కలాన్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. వడ్లు విక్రయించిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని తెలిపారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పి.రాములు, పీఏసీఎస్ సీఈవో నర్సింహులు, ఏఈవోలు సంజూ, సంతోష్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

పరిగి: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పరిగి సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రదేశాలను పరిశీలించారు. ఆ స్థలాల్లో ఏం చేస్తే ప్రమాదాలను నివారించవచ్చో చర్చించారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అవసరమైన చోట్ల మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ నరేందర్, జేఈఈ సురేందర్, ఎస్ఐ మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

వికారాబాద్: చిన్నతనంలోనే వివాహమైన ఒక వైపు కుటుంబాన్ని చూసుకుంటూ మరోవైపు బ్రిటిష్ పాలకులపై పోరాటం చేసిన యోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి అని వికారాబాద్ ఎస్ఐ మీనాక్షి అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని గౌతమి కళాశాలలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలను నిర్వహించగా ఎస్ఐతో పాటు విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి శ్రీలతరెడ్డి హాజరయ్యారు. నేటి సమాజంలో మహిళలు ఎన్నో రంగాల్లో ముందున్నారని తెలిపారు. స్త్రీ అంటేనే ఓపికకు మారుపేరని, స్త్రీ అనుకుంటే ఏదైనా సాధించొచ్చని తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, రాష్ట్రీయ కళా మంక్ స్టేట్ కన్వీనర్ మల్లేశం, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీష్, మంజునాథ్, నందురెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో...

కొడంగల్: కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాండు, గౌసియా, హారిక, నజియా, ఏబీవీపీ నాయకులు రజనీకాంత్, రిషికేశ్, కార్తీక్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో గురుకుల కళాశాల విద్యార్థుల ప్రతిభ

కొడంగల్ రూరల్: వికారాబాద్‌లో స్టూడెంట్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఖో ఖో క్రీడలలో కొడంగల్ గురుకుల కళాశాల విద్యార్థులు అండర్14, అండర్17లో ద్వితీయ స్థానం పొందారు. ప్రతిభ చూపిన వరుణ్‌సందేశ్, ధనుష్, వికాస్, లక్ష్మణ్‌ను ప్రిన్సిపాల్ బి.రామదాసు అభినందించారు. క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయని అన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ నర్సింగ్ విద్యార్థిని మృతి



పూజిత(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని మనస్థాపానికి గురైన బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని కళాశాల మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. ఘట్‌కేసర్ సీఐ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలకు చెందిన మల్లి పూజిత(22) అన్నోజిగూడలో అద్దెకుంటూ అవుశాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో నీలిమా కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో బీఎస్సీ నర్సింగ్ మూడో సంవత్సరం చదువుతోంది. పూజిత, మహబూబ్‌నగర్‌కు చెందిన ప్రవీణ్‌లు ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుంటానని ఇప్పుడు చేసుకోవడం లేదని మనస్థాపానికి గురైన పూజిత ఈ నెల 6న కళాశాల భవనం మూడో అంతస్తు నుంచి దూకింది. తీవ్ర గాయాలైన ఆమెను నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పూజిత మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అడవి పందులు ఢీకొని ఉపాధి టీఏలకు గాయాలు

బషీరాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అడవి పందులు ఢీకొట్టడంతో ఇద్దరు ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన బషీరాబాద్ మండలం కాశీంపూర్ సమీపంలో జరిగింది. టీఏలు నారాయణ. శాముప్ప ఇద్దరు బైక్‌పై ఉదయం 10.30గంటలకు కార్యాలయానికి బయలుదేరారు. కాశీంపూర్ సమీపంలోకి రాగానే అడవి పందుల గుంపు వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరూ పడిపోయి గాయపడ్డారు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. బాధితులను తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెసుకున్న ఏపీఎం శారద, ఈసీ నర్సింహారెడ్డి, ఎఫ్ఏల సంఘం మండలాధ్యక్షుడు శేఖర్ ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు.

ఎల్పీజీని రీఫిల్లింగ్ చేస్తున్న ఇద్దరి అరెస్ట్

మేడ్చల్ టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లో ఎల్‌పీజీ సిలిండర్లను అక్రమంగా రీఫిల్ విక్రయిస్తున్న ఇద్దరిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బి.శ్రీపాల్, ఎస్సై యతీష్ ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్ల రీఫిల్లింగ్ వ్యాపారం చేస్తున్న ఇమ్మాన్, మన్మథరావు దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఇద్దరిని అరెస్టు చేసి 94 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

పెద్దేముల్ ఎస్ఐ, కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలి

తాండూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అనుమానితుడి పేరిట ఫిరోజ్‌ను థర్డ్ డిగ్రీ ఉపయోగించిన పెద్దేముల్ ఎస్ఐ వేణు, కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హక్కుల పోరాట సమితి నియోజకవర్గ ఇన్‌చార్జి కె.చంద్రయ్య డిమాండ్ చేశారు. బుధవారం తాండూరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఫిరోజ్‌ను పరామర్శించిన అనంతరం మాట్లాడారు. ఎస్ఐపై చర్యలు తీసుకోకపోతే తాండూరు డీఎస్పీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. మంబాపూర్‌నకు చెందిన ఫిరోజ్‌కు మంచి వైద్యం అందించాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీకి, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని వారు పేర్కొన్నారు.

యాలాల: పెద్దేముల్ ఎస్ఐ వేణుకుమార్, కానిస్టేబుల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బుగ్గప్ప డిమాండ్ చేశారు. యాలాలలో సీపీఎం, కేవీపీఎస్ నాయకులు విలేకరులతో మాట్లాడారు. యు.బుగ్గప్ప, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య మాట్లాడుతూ.. మంబాపూర్‌కు చెందిన ఫిరోజ్‌పై థర్డ్ డిగ్రీతో చిత్రహింసలు పెట్టి చట్టాన్ని ఉల్లంఘించారన్నారు. రెండు నెలల క్రితం జరిగిన సంఘటనకు సంబంధం ఉన్నట్టు అనుమానం ఉందని, ఫిరోజ్ మేనమామ, భార్య తండ్రి కూడా ఒకే రోజు పొలంవద్ద మృతిచెందగా, ఎస్ఐ వేణుకుమార్ వారిది హత్య అనే అనుమానంతో పోస్టుమార్టం చేయించారన్నారు. రెండు నెలల తర్వాత ఆధారాలు లేకుండానే ఫిరోజ్‌ను హింసించాడన్నారు. కార్యక్రమలో నాయకులు గుడ్ల నర్సింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌కు పెద్దేముల్ ఎస్ఐ వేణు

తాండూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అనుమానితుడిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి చితకబాదిన సంఘటనపై పెద్దేముల్ ఎస్ఐ వేణును వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ కె.నారాయణరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వికారాబాద్ సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న పి.శంకర్‌ను పెద్దేముల్‌కు నియమించారు. కాగా ఇదే కేసులో సీఐ నగేష్ విధుల పట్ల నిర్లక్ష్యంపై ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

తాకట్టు.. భూంఫట్!

(ఐదో పేజీ తరువాయి)



న్యాయం చేయాలని కోరుతున్న రైతులు

పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసిన పోలీసులు కొందరినే రిమాండ్‌కు తరలించారు. మిగతావారికి స్టేషన్ బెయిల్‌కు స్వయంగా పోలీసులే సహకరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఓ వ్యక్తి పోలీస్ ఉన్నతస్థాయి అధికారికి దూరపు బంధువు కావడంతో పట్టించుకోడం లేదని విమర్శలు వస్తున్నాయి.

తాకట్టు పేరుతో భారీ మోసాలు

రంగారెడ్డి జిల్లా షాబాద్, షాద్‌నగర్, తదితర ప్రాంతాలకు చెందిన కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి మోసాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. కులకచర్ల మండలం అంతారం, బండవెల్కిచర్ల గ్రామాల్లో అప్పుల పేరుతో మార్టిగేజీ అని చెప్పి ఏకంగా సేల్ డీడ్ చేసుకోవడం కలకలం రేపుతున్నది. పరిగి మండలం మిట్టకోడూరు గ్రామంలో, దోమ మండలం మైలారం గ్రామంలో ఇలాంటి ఘటనలు పోలీస్‌స్టేషన్ల వరకూ వెళ్లాయి. అధికార పార్టీ నేతల అండదండలతో కొందరు మోసాలకు పాల్పడినట్లు తెలిసింది. పూడూరు, పరిగి, కులకచర్ల, శంకర్‌పల్లి, షాద్‌నగర్, షాబాద్ తదితర మండలాల్లో కూడా ఇలాంటి ఘటనలు బయటపడుతున్నాయి. షాద్‌నగర్ కేంద్రంగా ఏర్పడిన ముఠా ఏకంగా రూ.80 కోట్లకుపైగా ఈ విధంగానే అప్పుల పేరిట మోసాలకు పాల్పడినట్లు సమాచారం. మార్టిగేజిల పేరుతో బాడానేతలు, ఎన్ఆర్ఐ వారికి విక్రయాలు జరిపినట్లు ఈ తతంగంలో కమిషన్ ఏజెంట్లు ఉండడం గమనార్హం.

పీఎస్‌ల కేంద్రంగానే సెటిల్‌మెంట్లు

మోసపూరిత వ్యవహారాలు పోలీస్‌స్టేషన్‌ల కేంద్రంగానే కొనసాగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. రియల్టర్ల చేతిలో మోసపోయిన వారు పోలీసులకు ఫిర్యాదు చేస్తే బాధితులనే బెదిరిస్తున్న ఘటనలు ఉన్నాయి. అంతారం కేసులో కీలక వ్యక్తులను వదిలేసినట్లు తెలిసింది. ఆరుగురు కలిసి మోసాలకు పాల్పడినట్లు తెలినా ఇద్దరిని మాత్రమే రిమాండ్‌కు తరలించారు. మిగతావారు పోలీసుల సహకారంతో హైకోర్టు నుంచి బెయిల్ పొందినట్లు తెలిసింది. ఆస్తులు తాకట్టు పెడుతున్న సమయంలో రెవెన్యూ అధికారులు ఎలాంటి వివరాలు సేకరించకుండానే బ్రోకర్లు చెప్పిన విధంగా డాకుమెంట్లను రిజిస్ట్రేషన్ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

బాధితులకు న్యాయం చేయాలి



కొందరు రియల్టర్లు గ్రామాల్లో అమాయక రైతులను మోసం చేస్తున్నారు. ముఠాగా ఏర్పడి భారీ మోసాలకు పాల్పడుతున్నారు. ముందుగా అంతారం రైతులకు న్యాయం చేయాలి. ఇలాగే అనేక చోట్ల జరుగుతున్నాయి. పోలీసులు మోసగాళ్లకే సహకరిస్తున్నారు. ఈ విషయంపై ప్రజాప్రభవన్, హెచ్ఆర్సీ, ఉన్నతస్థాయి అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ జరిపి మోసగాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి.

\- రాఘవేందర్‌గౌడ్, పీఎన్‌పీఎస్ అధ్యక్షుడు

కఠిన చర్యలు తీసుకుంటాం



భూములు, ఆస్తుల క్రయ, విక్రయాల్లో మోసాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు. కులకచర్ల మండలం అంతారం ఘటనలో నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించాం. ఎక్కడైనా, ఎవరైనా కుదువ పేరిట రిజిస్ట్రేషన్లు చేసుకుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తాం. మోసం చేసే వాళ్లు ఎంతటివారైనా శిక్షిస్తాం. బాధితులు భయపడకుండా ఫిర్యాదు చేయవచ్చు.

\- ఎస్.శ్రీనివాస్, డీఎస్పీ, పరిగి